క్లుప్తంగా

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న రవిరాజు

శ్రీరంగరాజపురం: స్థానిక ప్రాథమిక వైద్యశాల వద్ద జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవిరాజు చేతుల మీదుగా టీబీ రోగులకు సోమవారం పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందులతో పాటు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని తెలిపారు. పౌష్టికాహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, వ్యాధి నియంత్రణలో ఉంటుందని చెప్పారు. దాతలు ముందుకు వచ్చి టీబీ రోగులకు పౌష్టికాహారం అందించడానికి కృషి చేయాలని కోరారు. డాక్టర్ పల్లవి, సందీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుసాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ప్రతాప్

నగరి: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు విజయపురం మండలం కేశవరాజపురం గ్రామానికి చెందిన అంజనాద్రికి ఆహ్వానం అందింది. ఈ మేరకు అతనికి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నుంచి ఆహ్వానపత్రిక వచ్చింది. ఈ బ్రహ్మోత్సవాలకు 300 మందిని ఎంపిక చేయగా అందులో తాను ఎంపికైనట్లు అంజనాద్రి తెలిపారు. కవులు, కళాకారులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి తనకు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

విశ్రాంతి భవనానికి స్థలం కేటాయించండి



జేసీకి సమస్యలను వివరిస్తున్న పన్నీర్ సెల్వం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ డ్రైవర్లు విశ్రాంతి పొందేందుకు కలెక్టరేట్‌లో విశ్రాంతి భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్ సెల్వం కోరారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు జేసీ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి పలు సమస్యలను చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వ ఉన్నతాధికారులు, జిల్లా అధికారుల డ్రైవర్లు విశ్రాంతి పొందేందుకు భవనం అవసరమన్నారు. కలెక్టరేట్‌లో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జేసీ న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, సురేష్‌బాబు, బాలాజీ, అరుణ్, ధనంజయ, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామికి పూజలు



విశేషాలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం చేశారు. అనంతరం పలురకాల పుష్పాలు, వెండి నాగాభరణంతో అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళహారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కామర్స్ విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : కామర్స్ విభాగంలో పీజీ చేసిన విద్యార్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ విభాగపు డైరెక్టర్ వీఎన్.బాబు తెలిపారు. ఎస్వీయూలోని కామర్స్ విభాగంలో సోమవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి అనుకున్న లక్ష్యాన్ని అధిరోహించాలని తెలిపారు. చదువుతో పాటు నైపుణ్య సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ సెలక్షన్స్‌ను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ విభాగపు డైరెక్టర్ వీఎన్.బాబు ప్రొఫెసర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు ఎం.రాజశేఖర్, మోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, అకడమిక్ కన్సల్టెంట్లు మణెయ్య, మల్లేశ్వరి, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంతి.. మారింది రైతు గతి

- బంతి పువ్వుల సాగుపై రైతుల ఆసక్తి
- నియోజకవర్గంలో 40 ఎకరాల్లో సాగు
- మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ. 50



ఎలకాటూరులో సాగులో ఉన్న బంతి

నగరి: సంప్రదాయ పంటలతో నష్టాలు చవిచూసిన కొందరు రైతులు ఇప్పుడు వాటికి బదులుగా పువ్వుల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. బంతి పువ్వులతో లాభాలు చూస్తున్నారు. నగరి మండలంలోని ముడిపల్లె, మూలనెత్తం, అడవికొత్తూరు, తెరణి, చిన్నతాంగెళ్, కష్టారామపురం, నింద్ర మండలంలోని ఎలకాటూరు గ్రామం, విజయపురం మండలంలో కళియంబాకం, పాతార్కాడు, మహారాజపురం, మల్లారెడ్డి కండ్రిగ, పుత్తూరు మండలంలోని గోపాలకృష్ణాపురం, కొండల చెరువు గ్రామాల్లో రైతులు పువ్వుల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ సాగైన పువ్వులు నేరుగా చెన్నై కోయంబేడు మార్కెట్‌కు, తిరుపతి పువ్వుల మార్కెట్‌కు తరలిస్తున్నారు. నియోజకవర్గం నుంచి నిత్యం 250 కేజీల వరకు పువ్వులు మార్కెట్‌కు వెళుతాయి. పసుపు బంతి కిలో రూ.40 నుంచి రూ.50 వరకు, ఎర్ర బంతి కిలో రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది.

పండుగలు, పెళ్లిళ్ల వేళ మంచి ధర

పైర్లకు, పువ్వుల సాగుకు ఎంతో వ్యత్యాసం ఉంది. మార్కెట్‌లో పువ్వుల ధర నిలకడ ఉండదు. రోజుకో ధర పలుకుతుంది. పండుగలు, పెళ్లిళ్ల సందర్భాల్లో పూలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో ధర అమాంతం పెరుగుతుంది. ముహూర్తాలు లేకున్నా, పండుగలు, పబ్బాలు తక్కువగా ఉన్నా ధరలు తగ్గుతాయి. దీనికి తోడు వాతావరణం కూడా పువ్వుల దిగుబడిని ప్రభావితం చేస్తుంటుంది. ఎకరాకు చీడపీడల నివారణ, కోత కూలీ ఖర్చులు పోను నెలకు రూ. 30వేలు వరకు ఆదాయం ఉంటుంది. రైతులు బంతి పూలతో పాటు సీజన్ల వారీగా వచ్చే మల్లె, రోజా, సంపంగి పూలను సాగుచేస్తూ ఆదాయం పొందుతున్నారు.

పదేళ్లుగా పూలసాగు చేస్తున్నా



“నాకు అర ఎకరం పొలం ఉంది. అందులో పదేళ్లుగా బంతి పూలు సాగుచేస్తున్నాను. ప్రతి రోజు ఉదయాన్నే పువ్వులను కోసి చెన్నై కోయంబేడు మార్కెట్‌కు తరలిస్తాను. కొన్నిసార్లు తిరుపతి, పుత్తూరు, నగరి పట్టణాలకు తరలిస్తాం. పండుగ రోజుల్లో పువ్వులకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఇతర ప్రాంతాలకు తరలించడానికి వీలులేని పరిస్థితుల్లో గ్రామాల్లో వీధుల్లో అమ్మేస్తాం. –కె.జ్ఞానమ్మ, ఎలకాటూరు.

నెలకు రూ.30 వేలు ఆదాయం వస్తోంది



పదేళ్లుగా నాకున్న రెండు ఎకరాల పొలంలో బంతి పూలు సాగుచేస్తున్నా. పువ్వులను తిరుపతి మార్కెట్‌కు తరలిస్తుంటా. ముహూర్తపు రోజుల్లో పువ్వులకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. తిరుపతికి తరలించిన పువ్వులు పోను మిగిలిన పువ్వులు బుట్టలో వేసుకుని వివిధ ప్రాంతాల్లో అమ్ముకుంటా. నెలకు రూ. 30 వేలు ఆదాయం వస్తుంది.
–లింగరాజు, ఎలకాటూరు

సూచనలు అందిస్తున్నాం



పంట సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. లాభాలు ఉండడంతో రైతులు పువ్వుల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి ఎక్కువగా వస్తుంది. 15 రోజులకు ఒకసారి పంటను పరిశీలించి ఎక్కడైనా పురుగులు ఆశిస్తే స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదిస్తే అక్కడి గ్రామ ఉద్యానవన సహాయకులు పరిశీలించి ఏ మందులు చల్లాలో చెబుతారు. –లోకేష్, ఉద్యానవన అధికారి

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మణిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

శ్రీరంగరాజపురం: మండలంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని.. 2024లో గెలుపే లక్ష్యంతో ముందుకెళదామని ఆ పార్టీ మండల కన్వీనర్ మణి అన్నారు. మణి సోమవారం బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో మండల కార్యాలయం వద్ద అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. విభేదాలను పక్కనపెట్టి ఐక్యతతో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. దళితుడైన తనకు పార్టీ మండల అధ్యక్ష పదవితో సుముచిత స్థానం కల్పించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ



కొటార్వేడు ఆర్బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. సోమవారం మండల పరిధిలోని డీఎం పురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లె రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాలు వంటి సమాచారాన్ని డ్యాష్ బోర్డులో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అలాగే డీఎం పురంలో నూతనంగా నిర్మిస్తున్న రెతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట ఏటో గాయత్రి, హేమాద్రి ఉన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి

గంగాధరనెల్లూరు: ఎండాకాలంలో వడదెబ్బ సోకకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తూగుండ్రం, ఆవలకొండ గ్రామాల్లో సోమవారం అవగాహన కల్పించారు. మెదడులోని హైపోథాలమస్ శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేస్తుందన్నారు. ఎండ ఎక్కువగా తలపై పడితే అది పనిచేయకుండా ఆగిపోతుందన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందన్నారు. ఎండకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలని సూచించారు. ఎండాకాలంలో ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎన్ఎం గంగ, సీసీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్వేటినగరంలో ‘గడప గడపకు’

కార్వేటినగరం: మండల కేంద్రంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. ఉదయం 7 గంటలకు కుమ్మరిగుంట వీధి నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు విజయవంతం చేయాలని కోరారు.

పది పరీక్షలు ప్రశాంతం



నగరి: పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

నగరి: పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నగరి మున్సిపల్ పరిధిలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏకాంబరకుప్పం జెడ్పీహెచ్ఎస్, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, సత్రవాడ, ఏకాంబరకుప్పం, పుదుపేట, తడుకుపేట జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. 1172 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 621 మంది బాలురు, 551 మంది బాలికలు ఉన్నారు. పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బఫర్ ప్రశ్నపత్రాలను చాలని ఇతర పాఠశాలలకు ఇవ్వాలన్న నిబంధన మేరకు కొత్తపేట తమిళ పాఠశాలకు తీసుకెళ్లారు. సెక్యూరిటీ లేకుండా తీసుకెళ్లడం గమనించిన సీఐ శ్రీనివాసంతి ఆయన్ను ప్రశ్నించారు. అలా ఎందుకు తీసుకెళ్లారో సంజాయిషీ ఇవ్వాలని కోరారు. మరోమారు అలాచేయరాదని హెచ్చరించారు.

నింద్రలో 180 మంది హాజరు

నింద్ర: మండలంలో మొత్తం 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. నింద్ర ఎస్ఐ శివశంకర్ విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ వేణు పరిశీలించారు.



పాలసముద్రంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ జయప్ప



నింద్ర పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు



నింద్రలో వీల్‌చెర్‌పై వచ్చిన దివ్యాంగుడు

పిల్లల సంరక్షణకు మిషన్ వాత్సల్య

నగరి: బాలబాలికల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోందని సీడీపీఓ కె.కృష్ణవేణి సోమవారం తెలిపారు. ఈ పథకానికి రూ.72 వేలలోపు వార్షిక ఆదాయం ఉండి తల్లి వితంతువుగా లేదా విడాకులు తీసుకున్న వారై ఉండాలన్నారు. అనాథలై బంధువుల వద్ద ఉంటున్న పిల్లలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న వారి పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన పిల్లలు అర్హులన్నారు. అలాగే జువైనల్ జస్టిస్ యాక్ట్ 2015ను అనుసరించి సంరక్షణ అవసరమైన పిల్లలు, బాల్యవివాహాల బాధితులు, అక్రమ రవాణాకు గురైన పిల్లలు, దివ్యాంగులు, వీధిబాలలు అర్హత పొందుతారన్నారు. ఇలాంటి వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత పొందిన వారికి నెలకు రూ.4 వేల స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. అర్హులైన వారు తల్లి, తండ్రి, గార్డియన్ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా మొదటి పేజీ జిరాక్స్, వయస్సు, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రం, (అనాథలైన పిల్లలకు తల్లితండ్రుల డెత్ సర్టిఫికెట్), రెండు ఫొటోలు జత చేసి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎంఎస్‌కేలను సంప్రదించాలన్నారు.

గజ వాహనంపై కరకంఠేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నగరి: పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారు గజవాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. టైలర్స్ అసోసియేషన్ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వైభవంగా తెప్పోత్సవాలు ప్రారంభం



తెప్పలపై విహరిస్తున్న సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామివారి తెప్పోత్సవాలు సోమవారం రాత్రి రామచంద్ర పుష్కరిణిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి ఆశీనులై పుష్కరిణిలో విహరించారు. స్వామి వారు తెప్పలపై ఐదు చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఘనంగా ఖనిజం తోట ఉత్సవం

కోదండరామస్వామి ఖనిజం తోట ఉత్సవం సోమవారం సాయంత్రంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కోదండరాముని బ్రహ్మోత్సవాల అనంతరం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. పూర్వం గోవిందరాజస్వామి ఆలయం వెనుకనున్న పాత హుజూర్ ఆఫీసులో ఉండే దిగుడు బావిలో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి స్నపన మంజనం జరిగేది. దీనికి గుర్తుగా ఆ సాయంత్రం గోవిందరాజస్వామి ఆలయ ప్రదక్షిణగా ఊరేగింపు చేస్తారు. అనంతరం కోదండరామస్వామి ఆలయం చేరుకుంటారు. ఈ ఉత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 4 గంటలకు శ్రీరాముల వారు ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గోవిందరాజస్వామి ఆలయ వాహన మండపానికి చేరుకున్నారు. అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించారు. స్వామి వారు అక్కడి నుంచి బయలుదేరి శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకుని తెప్పలై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



విశేషాలంకరణలో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి

లారీ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

పూతలపట్టు: లారీ డ్రైవర్ అదుపుతప్పి వృద్ధురాలిని ఢీ కొట్టిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని వేపలపల్లి పంచాయతీ ఒంటిల్లుకు చెందిన కే సావిత్రమ్మ(60) హైవే దాటుతుండగా తమిళనాడు నుంచి రాజమండ్రికి వెళుతున్న లారీ ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• బాబాకు పరీక్ష..!



బాబా ఆలయంలో విద్యార్థి పూజలు



ఆలయంలో చదువుతున్న విద్యార్థిని

పుత్తూరు రూరల్: ‘బాబా’ నా హాల్‌టికెట్ నీ పాదాల చెంత పెట్టి పూజిస్తున్నా, నన్ను పాస్ చెయ్యించాల్సిన బాధ్యత నీదే నంటూ ఓ విద్యార్థి వేడుకోలు! ‘బాబా’ బాగా చదివాను.. అయినా భారమంతా నీదే, మరో విద్యార్థి విన్నపం! ‘బాబా’ నీ సమక్షంలో కూడా చదువుతున్నా, నన్ను గట్టెక్కించాల్సిన బాధ్యత నీదే అంటూ ఓ విద్యార్థినీ అర్చన!.. ఇలా ‘పది’ పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ప్రార్థనలు విన్న ఆ షిర్డి సాయిబాబాకు నిజమైన పరీక్ష మొదలైంది. సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో పుత్తూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం సమీపంలోని సాయిబాబా ఆలయంలో విద్యార్థుల సందడి కనిపించింది. తొలి పరీక్ష కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు హడావుడి కనిపించింది. పుత్తూరులో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెయిన్ స్కూల్, ఏపీఎస్ఆర్‌డబ్ల్యూ, గోపాలకృష్ణాపురం, రాచపాళెం ఉన్నత పాఠశాల, గేటుపుత్తూరు తెలుగు పాఠశాల, హిమజ ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. పుత్తూరు మండలంలోని మొత్తం 9 పరీక్ష కేంద్రాల్లో 1,298 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా కేంద్రాల సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూయించారు. 18 మంది కానిస్టేబుల్స్, 20 మంది మహిళా పోలీసులు, ఇద్దరు ఎస్ఐలు, ఒక సీఐ పర్యవేక్షించినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



పరీక్షకు తరలివస్తున్న విద్యార్థులు